## క్లుప్తంగా

### అనాథ పిల్లలకు చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న యాదాద్రి ఇన్‌ఫ్రా చైర్మన్ ముచ్చర్ల శ్రీకాంత్

పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని ఘనపురం గ్రామానికి చెందిన తోటకూరి అంజనేయులు రోడ్డు ప్రమాదంలో, అతడి భార్య నీలమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. దీంతో అనాథలైన వారి పిల్లలు గ్రామంలోనే నానమ్మ దగ్గర ఉంటున్నారు. విషయం తెలుసుకున్న యాదాద్రి ఇన్‌ఫ్రా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, మహోనియా మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఎండీ ముచ్చర్ల శ్రీకాంత్‌యాదవ్ అనాథలైన చిన్నారులకు సోమవారం రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

### స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



నాగరాజు కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

త్రిపురారం: మండలంలోని పెద్దదేవులపల్లికి చెందిన మత్స్యకారుడు అంబటి నాగరాజు ఇటీవల నల్లగొండ మండలం పానగల్లులోని ఉదయ సముద్రంలో చేపల వేటకు వెళ్లి నీటిలో మునిగి చనిపోయాడు. మృతుడు నాగరాజుతో కలిసి 2002–03వ సంవత్సరంలో పెద్దదేవులపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదువుకున్న అతడి స్నేహితులు రూ.20,500 విరాళాలు సేకరించి సోమవారం అతడి కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం నాగరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సతీష్, శ్రీను, సైదులు, మహబూబ్, రవి తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసిన వైస్ ఎంపీపీ దిలీప్‌రెడ్డి తదితరులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని వైస్ ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి అన్నారు. తిరుమలగిరి మండలంలోని కొంపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం నుంచి మంజూరైన పాఠ్యపుస్తకాలను ఎంఈఓ తరి రాముతో కలిసి సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా సంవత్సరానికి రెండు జతల యూనిఫాం, సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కంసాని శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుముల శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు జలీల్, నరేషాచారి, అరుణ, విజయలక్ష్మి, విమల తదితరులు పాల్గొన్నారు.

### సర్టిఫికెట్లు ప్రదానం



క్రీడాకారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసిన రంజీ క్రికెట్ ప్లేయర్ డి. నాగేంద్ర

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ పట్టణంలోని హౌజింగ్‌బోర్డులో గల క్లియో స్పోర్ట్స్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సమ్మర్ ప్రత్యేక క్యాంపు ఆదివారం రాత్రి ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింటన్‌లో శిక్షణ పొందిన క్రీడాకారులకు రంజీ క్రికెట్ ప్లేయర్ డి. నాగేంద్ర సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో క్లియో స్పోర్ట్స్ కోచింగ్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ ఏచూరి హర్ష, కోచ్ మారబోయిన రామకృష్ణ, పీఈటీ వెంకటేశ్వర్లు, సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు, కోచ్ వెంకటరత్నం, క్రికెట్ కోచ్ కావలి వెంకన్న, కబడ్డీ కోచ్ నరేష్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్, లాస్య కంప్యూటర్ నిర్వాహకుడు కిరణ్ తదితరులున్నారు.

### సమస్యలపై ఉద్యమించాలి

మిర్యాలగూడ అర్బన్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ఉద్యమించాలని, తద్వారా పార్టీని బలోపేతం చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ అన్నారు. సోమవారం మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడ వస్కుల మట్టయ్య, నాయకులు వస్కుల గోపి, రామాంజి, జ్యోతి, చంద్రకళ పాల్గొన్నారు.

# సర్టిఫికెట్ల కోసం తిప్పలు

- తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు, లబ్ధిదారులు



నిడమనూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద సర్టిఫికెట్ల కోసం బారులుతీరిన లబ్ధిదారులు

హాలియా: నాగార్జునసాగర్ నియోజకవర్గంలో గుర్రంపోడు, పెద్దవూర, అనుముల, తిరుమలగిరి(సాగర్), నిడమనూరు, త్రిపురారం మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాలు ఉన్నాయి. 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు విద్యార్థులు, ఉద్యోగ నియామక ప్రక్రియకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం నిరుద్యోగులు, రాష్ట్ర ప్రభుత్వం జూన్‌లో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపడతామని ప్రకటించడంతో పాటు బీసీ కులవృత్తుల వారికి రూ.లక్ష ఆర్థికసాయం అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఇటు గొల్ల కురమలు, అటు బీసీ కులవృత్తుల వారు రెవెన్యూ సర్టిఫికెట్ల కోసం మీ సేవా కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రతిరోజు ప్రదక్షిణలు చేస్తున్నారు.

**ఆర్‌ఐ సంతకం ముందే..**

విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ, నివాసం, ఓబీసీ తదితర సర్టిఫికెట్లను తహసీల్దార్ కార్యాలయం నుంచి జారీ చేస్తారు. ముందుగా మీసేవా కేంద్రాలకు వెళ్లి అవసరమైన సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే పలు మీసేవా కేంద్రాల నిర్వాహకులు ముందుగా దరఖాస్తు ఫారాలపై ఆర్‌ఐ సంతకం చేయించుకుని వస్తేనే ఆన్‌లైన్ చేస్తామంటున్నారు. సంబంధిత ఆర్‌ఐ కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు తహసీల్దార్ కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఆర్‌ఐతో సంతకం చేయించుకుని మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు ఫారాలను ఆన్‌లైన్ చేసుకుని తహసీల్దార్ కార్యాలయాల్లో అప్పగిస్తున్నారు. అయితే వాస్తవానికి సర్టిఫికెట్ల కోసం ఎక్కడైనా మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశముంది. సంబంధిత దరఖాస్తులపై ముందస్తుగా ఆర్‌ఐ సంతకం చేయాల్సిన అవసరం లేదు. దరఖాస్తులను ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం మీసేవా కేంద్రాల నిర్వాహకులే సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లో అప్పగించాల్సిన బాధ్యత ఉంటుంది. అయితే పలువురు మీసేవా కేంద్రాల నిర్వాహకులు కేవలం ఆన్‌లైన్ చేసి దరఖాస్తులు తిరిగి ఇస్తున్నారు.

**పాత సర్టిఫికెట్లు ఉంటేనే కొత్తవి జారీ..**

సర్టిఫికెట్ల జారీలో కొందరు తహసీల్దార్లు పాత సర్టిఫికెట్లను జత చేస్తేనే కొత్తవి ఇస్తున్నారు. కులం సర్టిఫికెట్ కావాలంటే పాతవి జత చేయాలని లేకుంటే కుటుంబ సభ్యులది ఎవరిదైనా తీసుకురమ్మంటున్నారు. అయితే నిబంధనల ప్రకారం పాత సర్టిఫికెట్లను జత చేయాల్సిన అవసరం లేదు. సమగ్ర విచారణ చేసి సర్టిఫికెట్లను జారీ చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

### రెండు, మూడు రోజుల్లో జారీ



విద్య, ఉద్యోగ పరమైన సర్టిఫికెట్లను రెండు, మూడు రోజుల్లోనే జారీ చేస్తున్నాం. మీసేవా కేంద్రాల నుంచి వచ్చిన దరఖాస్తును ఎప్పటికప్పుడు పరిశీలించి ఆర్‌ఐ, తహసీల్దార్ లాగిన్లలో వెంటనే ఒకే చేయడం జరుగుతోంది. దరఖాస్తులకు సంబంధించి పాత ధ్రువీకరణ పత్రాలను జత చేస్తే మరింత వేగంగా సర్టిఫికెట్లను ఇచ్చేందుకు అవకాశముంది.

– మంగ, తహసీల్దార్, అనుముల మండలం

# ఆటల్లో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలి

- దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్



జెండా ఊపి 2కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ: క్రీడాకారులు ఆటల్లో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా దేవరకొండ పట్టణంలో సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమానికి ఎంతగానో కృషిచేస్తోందని అన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు క్రీడలను, క్రీడాకారులను విస్మరించాయని అన్నారు. అనంతరం 2కే రన్‌లో భాగస్వాములైన వివిధ అసోసియేషన్లకు ఎమ్మెల్యే ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ గోపిరాం, డీఎస్పీ నాగేశ్వర్‌రావు, మారుపాకుల సురేష్‌గౌడ్, దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, వైస్ చైర్మన్ రహత్‌అలీ, బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, ముత్యాల సర్వయ్య, సీఐ శంకర్, ఎస్‌ఐలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్‌లో చేరిక..**

చింతపల్లి మండలం పోలేపల్లి రాంనగర్‌కు చెందిన పలువురు నాయకులు సోమవారం దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కంకణాల వెంకట్‌రెడ్డి, దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, ఉజ్జిని విద్యాసాగర్‌రావు, విజమూరి రవి, బాదేపల్లి పులిరాజు, కొండల్‌నాయక్, గోవర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.

**ఎమ్మెల్యే నివాళి..**

డిండి: మండల పరిధిలోని బొగ్గులదొన గ్రామానికి చెందిన వేముల రాజు ఇటీవల మృతిచెందాడు. సోమవారం దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ బొగ్గులదొన గ్రామానికి చేరుకుని రాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట తండు వెంకటయ్య, శ్రీనువాసులు, చంద్రయ్య తదితరులున్నారు.

# తహసీల్దార్ కార్యాలయానికి పోటెత్తిన జనం



మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐల సంతకాల కోసం కిక్కిరిసిన జనం



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కూర్చొని దరఖాస్తు ఫారాలు నింపుతున్న లబ్ధిదారులు

- ప్రభుత్వ సాయం పొందేందుకు వివిధ సర్టిఫికెట్ల కోసం వచ్చిన లబ్ధిదారులు
- సర్వర్ డౌన్ కావడంతో కొద్దిసేపు సేవలకు అంతరాయం

మిర్యాలగూడ టౌన్: బీసీ కులవృత్తిదారులకు రూ.లక్ష ఆర్థికసాయం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో లబ్ధిదారులు దానికి కావాల్సిన సర్టిఫికెట్ల కోసం సోమవారం మిర్యాలగూడ మండల తహసీల్దార్ కార్యాలయానికి భారీగా తరలివచ్చారు. మరోవైపు మీసేవా కేంద్రాలు, జిరాక్స్ సెంటర్లు కూడా కిటకిటలాడుతున్నాయి. ఈ నెల 20వ తేదీ బీసీ కులవృత్తిదారులు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇవ్వగా.. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తులకు జత చేయాలని సూచించింది. అటు విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు కూడా వివిధ పత్రాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఒక వైపు సమయం దగ్గరపడుతుండగా మరో వైపు రెవెన్యూ అధికారులు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో నిమగ్నమయ్యారు. అంతే కాకుండా వరుసగా రెండో శనివారం, ఆదివారం సెలవులు రావడంతో సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఇద్దరు ఆర్‌లు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎటు వెళ్లకుండా కార్యాలయంలోనే ఉండి సర్టిఫికెట్లు జారీ చేశారు. కాగా సర్వర్ గంటన్నరకు పైగా పనిచేయకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. ఉదయం 10గంటల నుంచి అధికారులు కానీ, దరఖాస్తుదారులు కానీ భోజనాలకు కూడా వెళ్లకుండా కార్యాలయంలోనే ఉన్నారు. మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో 500 నుంచి 800 మంది, మిర్యాలగూడ మండలంలోని 46 గ్రామపంచాయతీల పరిధిలో 800 నుంచి 1000 మంది వరకు ఒక్క రోజే వివిధ మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే దరఖాస్తులు ఎలా రాయాలో తెలియని వారు దళారుల ఉచ్చులో పడి ఒక్కో దరఖాస్తుకు రూ.300 నుంచి రూ.500 చెల్లించడం గమనార్హం

### అక్రమాలపై విచారణ జరపాలని వినతి

పెద్దవూర: మండలంలోని పులిచర్ల గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని ఎంపీడీఓకు సోమవారం పలువురు వార్డు సభ్యులు వినతిపత్రం అందజేశారు. 2020–21 ఆర్థిక సంవత్సరంలో గ్రామంలో ఎల్‌ఈడీ వీధి దీపాల ఏర్పాటుకు గాను అక్రమంగా ఎంబీలు తయారుచేసి రూ.16లక్షలు డ్రా చేసుకున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. గత దసరా పండుగకు 150 ఎల్‌ఈడీ వీధి దీపాలను ఏర్పాటు చేసి 2022–23 సంవత్సరంలోనూ అక్రమ ఎంబీలు సృష్టించి సర్పంచ్, ఏఈలు రూ.17లక్షల గ్రామపంచాయతీ నిధులను దుర్వినియోగం చేయడానికి పూనుకున్నారని ఎంపీడీఓకు వివరించారు. గ్రామపంచాయతీలో ఎలాంటి అభివృద్ధి పనులకు నిధులు వినియోగించకుండా వీధి దీపాల పేరుతో దుర్వినియోగానికి పాల్పడుతున్న వారిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో వార్డు సభ్యులు బుడిగపాక లక్ష్మి, కమ్మంపాటి జానకి, నారబోయిన సైదమ్మ, బుడిగపాక సంధ్య ఉన్నారు.

### కల్యాణమస్తు కిట్లు పంపిణీ



కల్యాణమస్తు కిట్లు పంపిణీ చేస్తున్న బీఎల్‌ఆర్

మిర్యాలగూడ: కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, సామాజికవేత్త బత్తుల లక్ష్మారెడ్డి(బీఎల్‌ఆర్) సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని తన కార్యాలయంలో మండలంలోని 50 నిరుపేద కుటుంబాలకు చెందిన ఆడబిడ్డలకు శ్రీ శ్రీనివాస కల్యాణమస్తు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబంలోని ఆడపిల్ల వివాహం చేయాలంటే తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్న క్రమంలో తాను శ్రీ శ్రీనివాస కల్యాణ శుభమస్తు కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పేదింటి ఆడపిల్లల వివాహ సమయంలో ఈ కిట్లను అందజేయడం తనకు ఆనందంగా ఉందన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణలో నంబర్‌వన్

- మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు



యువకులతో కలిసి 2కే రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ: శాంతిభద్రతల పరిరక్షణలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నంబర్‌వన్ స్థానంలో ఉందని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు నిర్వహించిన 2కే రన్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. అనంతరం 2కే రన్‌లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన యువతీ, యువకులకు, ఆశ వర్కర్లు, పోలీసులకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున రూ.20వేలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ ధనావత్ చిట్టిబాబునాయక్, డీఎస్పీ వెంకటగిరి, ఆర్డీఓ చెన్నయ్య, మదార్‌బాబా, హాతీరాం, రవితేజ, అధికారులు, పోలీసులు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, నాయకులు, పాల్గొన్నారు.

# దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోంది

- నాగార్జునసాగర్ ఎమ్మెల్యే భగత్



2కే రన్‌లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే భగత్

హాలియా: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలతో దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో హాలియా పట్టణంలో నిర్వహించిన తెలంగాణ 2కే రన్‌ను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కష్టపడే వారికి వెన్నుదన్నుగా నిలిస్తే అభివృద్ధిని పరుగులు పెట్టించేందుకు దోహదపడుతుందని అన్నారు. అనంతరం 2కే రన్‌లో పాల్గొన్న విజేతలకు మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, హాలియా మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్లు జవ్వాజి వెంకటేశ్వర్లు, మర్ల చంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, సీఐలు గాంధీనాయక్, భీసన్న, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు, మార్కెట్ డైరెక్టర్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

- ఎంపీపీతో సహా ఆరుగురు ఎంపీటీసీలు, ఇద్దరు సర్పంచ్‌లు మాత్రమే హాజరు
- సంతకం చేసి కొద్దిసేపటి తర్వాత బయటకు వెళ్లిన వైస్ ఎంపీపీ



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న నిడమనూరు మార్కెట్ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి

నిడమనూరు: మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ బొల్లం జయమ్మ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని మొత్తం 13మంది ఎంపీటీసీలకు గాను ఆరుగురు, 29మంది సర్పంచ్‌లకు గాను ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. వైస్ ఎంపీపీ సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే బయటికి వెళ్లగా చివరకు ఐదుగురు ఎంపీటీసీలు మాత్రమే సమావేశంలో మిగిలారు. అధికారులు సైతం అరకొరగా సమావేశానికి హాజరుకావడం గమనార్హం. కాగా తుమ్మడం గ్రామంలో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని ప్రతి సమావేశంలో ప్రశ్నిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని అధికార పార్టీ ఎంపీటీసీ సభ్యుడు యాదయ్య వాపోయారు. అధికారులు పైపులు వేస్తున్నామని, లీకేజీలు సరిచేస్తున్నామని, మళ్లీ వచ్చే సమావేశం నాటికి నీళ్లు వచ్చేలా చూస్తామని చెబుతున్నారే తప్ప సమస్యను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా మార్లగడ్డ గ్రామంలో విద్యుత్ లోఓల్టేజీతో ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్ బానోతు విజయ సమావేశంలో ప్రస్తావించగా.. గ్రామంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని ట్రాన్స్‌కో అధికారి చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్, బొల్లం రవి, ఎంపీటీసీలు యాదయ్య, నాగేంద్ర, రాణి, రాధ, సర్పంచ్‌లు విజయ, గుడిసె శంకర్, ఐసీడీఎస్ పీడీ పద్మావతి, మండల వ్యవసాయ అధికారి మునికృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

### జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

నిడమనూరు: మండలంలోని ముకుందాపురంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను సోమవారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు యడవెల్లి వల్లభరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసికోల్లాసానికి ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కేశ శంకర్, ఫ్రెండ్స్ యూత్ నిర్వాహకుడు శ్రీకాంత్, వ్యాయామ ఉపాధ్యాయుడు, వాలీబాల్ కోచ్ మైలారిశెట్టి సత్యనారాయణ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



లబ్ధిదారుకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం అని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. పెద్దవూర మండలంలోని పూల్యతండాకు చెందిన రమావత్ కవితకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.60వేల చెక్కును సోమవారం తిరుమలగిరి మండలంలోని రంగుండ్ల తండాలో లబ్ధిదారుకు ఆయన అందజేసి మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ కావాలనుకునే వారు దళారులను ఆశ్రయించకుండా నేరుగా తన క్యాంపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్, జెడ్పీటీసీ ఆంగోతు సూర్యభాషానాయక్, తిరుమలగిరి సర్పంచ్ శాగం శ్రవణ్‌కుమార్‌రెడ్డి, నందికొండ మున్సిపల్ కౌన్సిలర్ ఈర్ల రామకృష్ణ, మాజీ ఎంపీపీ అల్లి పెద్దిరాజు, నాయకులు రవినాయక్, చందు, వినోద్, బాలు, రవి తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ నీరు రావడం లేదు

- సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ సరళ

మిర్యాలగూడ: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీపీ నూకల సరళాహన్మంతరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మిర్యాలగూడ మండలంలోని శ్రీనివాస్‌నగర్, జంకుతండా, జాలుబాయితండా గ్రామాల్లోని ప్రజలకు మిషన్ భగీరథ నీరు అందడం లేదని రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయమై పలుమార్లు సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదన్నారు. అదేవిధంగా గ్రామాల్లో విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండటం లేదని పలువురు ప్రజాప్రతినిధులు సమావేశంలో ప్రస్తావించారు. మన ఊరు–మన బడి కింద 15పాఠశాలల్లో మరమ్మతులు జరుగుతున్నాయని ఎంఈఓ బాలాజీనాయక్ తెలుపగా, పనులు త్వరగా పూర్తిచేయాలని తిప్పన విజయసింహారెడ్డి అన్నారు. సమావేశంలో ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మి, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఐసీడీఎస్ పీఓ ఆర్. మమత, ఎంపీఓ వీరారెడ్డి, ఏఈఈలు ఆదినారాయణ, మౌనిక, దీక్షిత, బీసీడబ్ల్యూ నుశ్రత్ అలీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకే పాదయాత్ర

పెద్దవూర: బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి, గిరిజనులను చైతన్య చేసేందుకే ఈ నెల 14వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని 90 తండాల మీదుగా గిరిజన చైతన్య యాత్ర పేరుతో పాదయాత్ర చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డితో కలిసి పెద్దవూర మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ గిరిజనులను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకున్నారే తప్ప వారికి చేసిందేమీ లేదని అన్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి అంతా జానారెడ్డి హయాంలోనే చేసిందేనని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనులకు ఉన్న పథకాలన్నీ ఎత్తివేశారని అన్నారు. ఈ నెల 14న పెద్దవూర మండలంలోని గేమ్యానాయక్ తండాలో పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఈ పాదయాత్రలో మండల, జిల్లా, నియోజకవర్గ, గ్రామ కమిటీలన్నీ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎంపీపీ రమావత్ శంకర్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పబ్బు యాదగిరిగౌడ్, పగడాల నాగరాజు, సల్ల హన్మంతరెడ్డి, సతీష్, రవి తదితరులు పాల్గొన్నారు.

### వీహెచ్‌పీఎస్ కన్వీనర్‌గా ఖాసీం

త్రిపురారం: వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) త్రిపురారం మండల కన్వీనర్‌గా మండలంలోని పెద్దదేవులపల్లికి చెందిన షేక్ ఖాసీం(ఖలీల్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా కోకన్వీనర్‌లుగా జొన్నలగడ్డ నరేందర్, తవుడబోయిన చంద్రశేఖర్, అనుముల నారాయణరెడ్డి, కొండ మల్లయ్య ఎన్నిక కాగా, జిల్లా అధ్యక్షుడు కొత్త వెంకన్న వారికి నియామక పత్రాలు అందజేశారు.

### గిరిజన చైతన్య యాత్రను విజయవంతం చేయాలి

హాలియా: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కుందూరు జైవీర్‌రెడ్డి ఈ నెల 14 నుంచి చేపట్టనున్న గిరిజన చైతన్య యాత్రను విజయవంతం చేయాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గోనీ రాజారమేష్‌యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం హాలియా పట్టణంలోని పాత ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన యువజన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజనులకు గిరిజన బంధు ఇస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. రాష్ట్రంలో 11లక్షల మంది పోడు భూము సాగుదారులు దరఖాస్తు చేసుకుంటే 3లక్షల మందికి మాత్రమే పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని అన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభరెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు పగడాల నాగరాజు, ఉపాధ్యక్షుడు మేరావత్ మునినాయక్, ప్రధానకార్యదర్శి ఐతగోని సతీష్‌గౌడ్, నకిరేకంటి సైదులు మాదిగ, అమరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజారమేష్‌యాదవ్

## సంక్షిప్త సమాచారం

**అకౌంట్ మార్చుకునేందుకు అవకాశం**

అడవిదేవులపల్లి: రైతు బంధు సాయం పొందే రైతులు తమ బ్యాంక్ అకౌంట్‌ను మార్చుకోవాలంటే సంబంధిత వ్యవసాయ అధికారులను సంప్రదించాలని మండల వ్యవసాయశాఖ అధికారి అర్చన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్యాంక్ అకౌంట్‌ను మార్చుకోవాలనుకునే రైతులు తమ బ్యాంకు పాసుపుస్తకం, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లను తీసుకొని రావాలని సూచించారు.

**మైనార్టీ బంధు ప్రకటించాలి**

వేములపల్లి: దళిత బంధు మాదిరిగా మైనార్టీ బంధు ప్రకటించాలని వేములపల్లి గ్రామ మైనార్టీ శాఖ అధ్యక్షుడు ఎస్‌కే సోయల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన వేములపల్లి మండల కేంద్రంలో మాట్లాడుతూ.. తెలంగాణలో గత 9 సంవత్సరాల నుంచి పేద ముస్లింలకు ఎలాంటి పథకాలు అందలేదన్నారు. ప్రభుత్వం మైనార్టీ బంధును ప్రకటించి పేద ముస్లింలకు రూ.10లక్షలు అందజేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో మహమూద్, ముబీన్, సజ్జు, నవీద్ పాల్గొన్నారు.

**కల్వర్టు నిర్మాణ పనుల పరిశీలన**

హాలియా: పట్టణంలోని 11వ వార్డులో నిర్మల స్కూల్ వద్ద రూ.లక్షతో మురుగు కాల్వపై చేపడుతున్న కల్వర్టు నిర్మాణ పనులను బీఆర్‌ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వర్ర వెంకట్‌రెడ్డి సోమవారం పరిశీలించి మాట్లాడారు. అంగడి బజార్ రోడ్డులో నిర్మల స్కూల్ వద్ద మురుగు కాల్వపై కల్వర్టు లేని కారణంగా రామచంద్రనగర్, రెడ్డి కాలనీ, జానారెడ్డి కాలనీ ప్రజలకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి కల్వర్టు నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు.

**గజలాపురంలో బడిబాట**

మాడుగులపల్లి: మండలంలోని గజలాపురంలో సోమవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాల సిబ్బంది విద్యార్థులతో కలిసి ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరామ్‌సింగ్ మాట్లాడుతూ.. బడీడు పిల్లలను తల్లిదండ్రులు బడికి పంపాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది హరిలాల్, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సైదయ్య తదితరులు పాల్గొన్నారు.